# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 05-09-2024 | సంపుటి : 06 | సంచిక : 346 | పేజీలు : 8 | వెల : రూ 3-00







## ట్రాక్టర్ నడుపుతూ మంత్రుల పర్యటన

విజయవాడ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి బుధవారం ఉదయం చిట్టి నగర్ ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహార పంపిణీ చేసేందుకు ట్రాక్టర్ నడుపుతూ ముంపు ప్రాంతాలకు వెళ్లారు. నేరుగా బాధితులకు ఆహారం, పాలు, తాగునీరు పంపిణీ చేసారు. ప్రతి ఇంటి వద్ద ఆగి ఆహారం అందిందా లేదా అని మంత్రులు అడిగారు. ట్యాంకర్ల ద్వారా నివాసాలకు నీటి సరఫరా చేస్తున్నారు.

# విలవిలలాడుతున్న బెజవాడ

విజయవాడ, సెప్టెంబర్ 4 కనీ, వినీ ఎరుగని వరదలివి. ఒక్కసారిగా కృష్ణమ్మ ఉప్పొంగిపోయింది. కృష్ణా నదిలో సంగమించే మున్నేరు.. బుడమేరు ఉగ్రరూపం దాల్చాయి. కుండపోత వానలతో వాన నీరు వరదనీరుగా మారి ఊళ్లను.. విజయవాడ నగరంలోని పలు కాలనీలను ముంచెత్తింది. గత రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన అతి పెద్ద వరదల్లో ఇప్పుడు విజయవాడ వరద కూడా వచ్చి చేరింది. విజయవాడ నగరంలో 40% పైగా ప్రాంతము వరద ముంపునకు గురయింది. నగరం చుట్టూ ఉన్న రెండు నదులు, కృష్ణా ? బుడమేరు ఒడ్డు దాటి నగరాన్ని ముంచెత్తాయి. విజయవాడలో ఎప్పుడూ వరద అంటే తెలియని చాలా ప్రాంతాలు కూడా ఈసారి వరదల్లో మునిగిపోయాయి అంటే వరద తీవ్రత అర్ధం చేసుకోవచ్చు. ఈ వరదలు ఎన్టీఆర్ జిల్లాలో 2.76 లక్షల మంది ప్రజలను ప్రభావితం చేశాయి. మనిషి ప్రకృతి ముందు ఎంత అల్పుడో మొన్న కేరళలోని వయనాడ్ బీభత్సం తెలియజేస్తే లేటెస్ట్‌గా బెజవాడ వరదలు మరోసారి కన్నెర్రశాయి. ముఖ్యంగా విజయవాడ సిటీ మధ్యలో ప్రవహించే బుడమేరు అనే చిన్న నది నాలుగు జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ సిటీ అయితే రెండు రోజులుగా నిద్ర పోవడం లేదు. సగానికిపైనే నగరం మొత్తం నీటిలో మునిగిపోయింది. విజయవాడ శివారు గ్రామాలు, ఏరియాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సింగ్‌నగర్, రామకృష్ణాపురం, నందమూరినగర్, నున్న, విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలలో ఇళ్ళలోకి నీరు చేరిపోయింది. రామవరప్పాడు రైల్వే స్టేషన్ అయితే మొత్తానికి నీట మునిగింది. బుడమేరు వాగు తన విశ్వ రూపాన్ని చూపిస్తోంది. దాని కట్ట తెగిపోవడంతో విజయవాడను ముంచెత్తింది. చాలామంది ప్రజలు మునిగిపోయిన ఇళ్ళలోనే ఇంకా చిక్కుకు పోయారు. వారిని కాపాడటానికి కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి.బుడమేరు అనేది మైలవరం కొండల్లో పుట్టిన ఒక పెద్ద వాగు. అయితే చరిత్రలో చాలా ఏళ్ళ నుంచి దానిని నదిగానే పరిగణిస్తూ అంటారు. ఏడాది పొడవునా ఏదో ఒక స్థాయిలో దీన్లో నీళ్ళు ఉంటాయి. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరుకు నీటిని సప్లయి చేసే అతి ముఖ్యమైన వాగుల్లో పుట్టిన ప్రాంతం నుంచి దాదాపు 170ని.మీ దూరం ప్రవహించే బుడమేరులో ఏటా 10 వేల నుంచి 11 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 2005 ప్రాంతంలో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది అని చెబుతారు. అప్పుడే విజయవాడ చాలా వరకూ దెబ్బతింది. ఆ తరువాత 2009లో మరోసారి అలాంటి పరిస్థితే ఎదురైంది. బుడమేరు వాగు తన ప్రయాణంలో చాలా మలుపులు మెలికలు తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినపుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాలకు చేరిపోతూ ఉండేది. అందుకే ఈ నదికి బెజవాడ దుఃఖ:దాయని అని పేరు పడింది. 2005లో వచ్చిన భారీ వరదలు చూసిన ఇరిగేషన్ శాఖ బుడమేరు నది పొడవునా ఒక రిటైనింగ్ వాల్ నిర్మించాలనే సూచన చేసింది. దీనిపై అప్పట్లో కొంతమేర వర్క్ జరిగినా తరువాత పూర్తిగా పక్కన పెట్టేశారు.



బుడమేరు నుంచి నీరు రెండు భాగాలుగా ఒకటి డైరెక్ట్‌గా కొల్లేరు చేరుకుంటే మరొకటి కృష్ణలో కలుస్తుంది. ఈ కృష్ణలో కలిసే భాగం మధ్యలో పోలవరం నుంచి వచ్చే కాలువతో చేరుతుంది. కొల్లేరుకు వెళ్ళే నది మధ్యలో కృష్ణ నుంచి విజయవాడ సిటీ మధ్యగా ప్రవహించే ఏలూరు కెనాల్‌లో కలుస్తుంది. బుడమేరు ప్రవహించే ప్రాంతంలో ఈ రెండు దశాబ్దాల్లో విపరీతంగా భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు పెరిగాయి. ఈ ప్రాంతాల్లో తక్కువ రేటుకే స్థలం లభిస్తుండడంతో పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు కొనుగోలు చేసి ఇళ్ళు కట్టుకున్నారు. ఓటు బ్యాంకు పాలిటిక్స్ వారికి అండగా నిలబడడంతో అధికారులు కూడా మిన్నకుండి పోయారు అనే ఆరోపణలు ఉన్నాయి. దానితో బుడమేరు ప్రవహించే చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఇప్పుడు భారీ వర్షాలు కురియడంతో పైనుంచి వచ్చిన వరద నీరు ఆ ఆక్రమణలను ముంచేసింది ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో బుడమేరుకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూచనలతో రిటైనింగ్ వాల్ నిర్మించడంతోపాటు నదీ పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగిస్తేనే బుడమేరుతో బెజవాడకు ఉన్న ప్రమాదం తొలగుతుంది అని పర్యావరణ వేత్తలు నిపుణులు చెబుతున్నారు .నగరం వేగంగా విస్తరించడం, బుడమేరు వాగు వరద మార్గాన్ని ఆక్రమణలు చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది.

## ఏపీ, తెలంగాణకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భారీ విరాళం




అమరావతి : ఉమ్మడి తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్‌భారీ విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు రూ. కోటిని సీఎంకు స్వయాన అందజేస్తానని తెలిపారు. విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపీలోని 400 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తనవంతుగా లక్ష రూపాయల చొప్పున రూ. 4 కోట్లు, ఏపీకి రూ. కోటి అందజేస్తానని ప్రకటించారు.పంచాయతీ రాజ్ ఉద్యోగులు, ఇంజినీర్లు విరాళం ప్రకటించడం పట్ల అభినందించారు. 2014-19లో వచ్చిన హుదాహుద్ తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులకు రూ. 50 లక్షలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఏపీలో వరదల వల్ల 29 మంది ప్రాణాలు కోల్పోయ్యారని, ఇద్దరు గల్లంతయ్యారని, 200 పశువులు , వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయని తెలిపారు.131 కేంద్రాల్లో పశువులకు చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 69 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. 233 కిలోమీటర్ల పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. వరద ఉధృతి తగ్గిన తరువాత రోడ్లు, కల్వర్టు బాగు చేస్తామన్నారు.

## వరద బాధితులకు ఏపీ ఎన్జీవో రూ. 120 కోట్ల భారీ విరాళం

అమరావతి : ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు భారీ విరాళాన్ని ప్రకటించారు. ఉద్యోగుల సెప్టెంబర్ నెల జీతంలో ఒక రోజు బేసిక్ పే ద్వారా రూ. 120 కోట్లు సీఎం సహాయనిధికి విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు , ఉపాధ్యాయులు పింఛన్ల నుంచి ఈ విరాళం అందజేస్తామని జేఏసీ నాయకులు కె.వి.శివారెడ్డి, విద్యాసాగర్ సీఎం చంద్రబాబుకు అంగీకార పత్రం అందజేశారు.వరద బాధితుల కోసం ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. 25 లక్షలు అందజేసింది. ఉమ్మడి తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణభారీ విరాళాన్ని ప్రకటించారు. సుమారు రూ. 6 కోట్లను ప్రకటించారు. ఏపీలోని 400 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తనవంతుగా లక్ష రూపాయల చొప్పున రూ. 4 కోట్లు అందజేస్తానని ప్రకటించారు. ఏపీకి, తెలంగాణకురూ.కోటి చొప్పున సీఎం సహాయనిధికిపంపిస్తానని తెలిపారు.



# వరదప్రాంతాల్లో అంబులెన్సులు




ప్రతి గ్రామ సచివాలయంలో ఒక మెడికల్ క్యాంప్
ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు
చనిపోయిన వారిని గుర్తించి కుటుంబాలకు అప్పగింత
లోకేశ్‌కు బుడమేరు రక్షణ బాధ్యతల పర్యవేక్షణ
మంత్రులు,అధికారులు, కలెక్టర్లతో సిఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్

అమరావతి,సెప్టెంబర్4: వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా అంబులెన్స్‌లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యలపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబానికి సాయం అందించాలన్నారు. వరదల్లో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించాలని చెప్పారు. ఎవరూ రాకపోతే ప్రభుత్వం తరపునే గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సచివాలయంలో ఒక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి నిత్యావసరాలు అందజేయాలి. 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంపలు, కిలో చక్కెర ఇవ్వాలి. మొబైల్ రైతుబజార్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు కూరగాయలు అందజేయాలి. ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా చర్యలు చేపట్టి సాధారణ స్థితికి తీసుకొస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారాన్ని ప్రభుత్వం తరపున అందించాలి. జ్వరాల నుంచి జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలి. ఎవరికి ఏ మెడిసిన్ కావాలన్నా అందుబాటులో ఉంచాలి. పంటనష్టంపై అంచనాలు నమోదు చేయాలని చంద్రబాబు తెలిపారు. మరోవైపుఅకాల వర్షాలు వల్ల మళ్ళీ బుడమేరుకు వరద ప్రవాహం పెరిగింది. దీంతో బుడమేరుకు గండ్లు పడిన ప్రదేశంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలకు అధికారులు ఉపక్రమించారు. కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరుకి మూడు చోట్ల గండ్లు పడ్డాయి. 200 మీటర్ల మేర గండ్లు పడడంతో కవులూరు, ఈలప్రోలు రాయనపాడు, సింగినగర్ మీద బుడమేరు విరుచుకుపడింది. వరద ఉధృతి తగ్గడంతోఇరిగేషన్ అధికారులు గండ్లను పూడుస్తున్నారు. గండ్లు పడడానికి ప్రధాన కారణం గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ మట్టి తవ్వకాలేనని రైతులు అంటున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.మరోవైపు బుడమేరుకు పడిన గండ్లు పూడ్చివేత కార్యక్రమాలను పర్యవేక్షించాల్సిందిగా మంత్రి లోకేష్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుడమేరు కుడి, ఎడమ ప్రాంతాల్లో పడిన గండ్లు గురించి నారా లోకేష్.. అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా గండ్లు పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గండ్లు పూడ్చివేత పనులను పర్యవేక్షించడానికి బుడమేరు వద్దకు లోకేష్ బయలుదేరి వెళ్లారు. మంత్రి లోకేష్ పర్యవేక్షణలో విజయవాడలో సహాయ చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. వరద బాధితులకు ఉదయమే ఇళ్లకు వెళ్లి 1200 మంది టీడీపీ కార్యకర్తలు టిఫిన్, పాలు అందజేశారు. వరద ప్రభావానికి గురైన 36 వార్డుల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి.అకాల వర్షాల వల్ల మళ్ళీ బుడమేరుకు వరద ప్రవాహం పెరిగిందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున మైలవరం, ఎగువ ప్రాంతమైన ఖమ్మం ఏరియాలో వర్షాలు పడటం వల్ల బుడమేరుకు 10 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. కొండపల్లి శాంతినగర్ ఎర్రబడ్జి వద్ద ఉన్న చెరువు కట్ట కూడా తెగిందన్నారు. దయచేసి చెరువుల గండ్లను తక్షణమే పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. అలానే బుడమేరు పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తను గొల్లపూడి మార్కెట్ యార్డులో ఉన్నానని, జక్కంపూడి కాలనీలోని వరద బాధితులకు ఆహారాన్ని పంపించే పనిలో నిమగ్నమై ఉన్నానన్నారు. అత్యవసరమైతే తనకు ఫోన్ చేయాలని వసంత కృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# వరద సహాయక చర్యల కోసం 12 బృందాల తరలింపు

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, సెప్టెంబర్ 3: విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరదల ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల రీత్యా సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జిల్లా నుండి 12 బృందాలను పంపినట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సహాయక బృందాలను పంపుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఒక్కో బృందంలో 8 మంది సభ్యులు ఉంటారని, ఈ బృందంలో ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తో పాటు పారిశుధ్య కార్మికులు ఉంటారన్నారు. కర్నూలు డివిజన్ లో కోడుమూరు నుంచి రెండు బృందాలు, గొందిపర్ల నుంచి ఒక బృందం ఉన్నాయన్నారు. పత్తికొండ డివిజన్ నుంచి ఆలూరు, మద్దికెర నుంచి ఒక్కో బృందం, పత్తికొండ నుంచి రెండు బృందాలు బయలుదేరాయన్నారు. ఆదోని డివిజన్ నుంచి ఆదోని, కోసిగి, గోనెగండ్ల, మంత్రాలయం, హ్వాళగుంద నుంచి ఒక్కో బృందం ఉన్నాయని ఆయన వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ బృందాలు సహాయపడతాయని కలెక్టర్ తెలిపారు.

## చంద్రబాబు ఇంట్లో ఉండలేని పరిస్థితులు.. కాబట్టే కలెక్టరేట్‌లో ఉండి బిల్డప్‌లు : వైఎస్ జగన్

అమరావతి : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని వైసీపీ అధినేత , మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. బుధవారం విజయవాడలో ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నివాసముంటున్న ప్రాంతం కూడా నీళ్లలో మునిగినందును అక్కడ ఉండలేని స్థితిలో కలెక్టరేట్‌లో ఉండి బాధితులకు సహాయం చేస్తున్న ట్లు బిల్డప్‌లు ఇస్తున్నారని ధ్వజమె త్తారు. వర్షాలు, వరదల సమా చారం ఉన్నాకూడా చంద్రబాబు ప్రజలను ఆదుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఎక్కడా రిలీఫ్ కేంద్రాలు కనిపించడం లేదని ఆరోపించారు. వైసీపీహయాంలో గోదావరికి వరదలొస్తే పెద్ద ఎత్తున్న ఆదుకున్నామని అన్నారు.ముందస్తు చర్యలు తీసుకుని నష్టం జరుగకుండా అడ్డుకున్నామని పేర్కొన్నారు. వాలంటరీ వ్యవస్థ ఉంటే , కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఉంటే విజయవాడ విపత్తుకు గురి అయ్యేది కాదని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా అట్టర్‌ఫ్లాప్ అని అన్నారు. వరదల్లో చనిపోయిన వారికి రూ. 25 లక్షల పరిహారం అందించాలని, ప్రతి ఇంటికి రూ. 50 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


# సంపాదకీయం

గురువారం 05-09-2024

## అపరాజిత సరే... శిక్షలు ఎక్కడ

దేశంలో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాల కేసుల్లో 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయంటే మన నేర ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏ విధంగా ఉందో ఈ గణాంకాలే తెలియజేస్తున్నాయి. అత్యాచారాలు చేసిన 72 శాతం నిందితులు నేర వ్యవస్థలో డొల్లతనాన్ని అసరాగా చేసుకొని నిర్ధోషులుగా బయటపడుతున్నారు. కోల్‌కతా రేప్ కేసును చేపట్టడంలో మొదటి నుంచి జరిగిన తప్పులు ఆ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. కోల్‌కతా నగరం రోడ్లన్నీ విద్యార్థుల ఆందోళనలతో, పోలీస్‌ల ప్రతిఘటన చర్యలతో రణరంగంగా దద్దరిల్లింది. దీనికి కారణం దర్యాప్తులో జరిగిన తప్పు లు, వ్యవస్థలోని లోపాలు చివరకు మమతాబెనర్జీ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు దారి తీస్తున్నాయి. అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా రూపొందించిన బిల్లును పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. అపరాజిత మహిళ, శిశు (పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా.. ముందుగా హామీ ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు ఓటింగ్ కోసం పట్టుబట్టలేదు. కేంద్ర చట్టాలు-- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎ?స), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎ?సఎ?స), చిన్నారులపై అత్యాచారాల నిరోధక చట్టం(పోక్సో)లో తగు సవరణలు చేయాల్సిందిగా ఈ బిల్లు సూచిస్తోంది. ముఖ్యంగా.. హత్యాచారాలు, అత్యాచారాలతో బాధితురాలి మానసిక స్థితి దెబ్బతినేలా చేసే నిందితులకు మరణ శిక్ష విధించాలని అపరాజిత బిల్లు స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కాగా, సభలో బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. "మా ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు తరహాలో.. ప్రధాని మోదీ చట్టాన్ని తీసుకురాకపోవడం సిగ్గుపడాల్సిన అంశం. ఈ బిల్లును హుందాగా ఆమోదించాల్సిందిగా గవర్నర్‌ను కోరుతున్నాను. సభలో విపక్ష నేత(బీజేపీ) కూడా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా, వీలైనంత త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఘటనలో సీబీఐ న్యాయం చేయాలని ఆమె కోరారు. ఏటా 30,000 కు పైగా అత్యాచారాలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమే కాకుండా, నేర న్యాయవ్యవస్థలోని పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లుఈ నాలుగు విభాగాల పనితీరులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ప్రకారం అత్యాచారాల కు పడిన శిక్షలు 2018 నుంచి 2022 వరకు 27 శాతం నుంచి 28 శాతం వరకే ఉన్నాయి. అంటే దేశంలో 72 శాతం అత్యాచార కేసు లు ఎలాంటి శిక్ష లేకుండానే ముగిసిపోయాయని చెప్పవచ్చు. అలాగే 2022లో బాలికలపై లైంగిక దాడి కేసులు 63 వేలకు పైగా నమోదయ్యాయి. అంటే దేశంలో ప్రతి పది నిమిషాలకు ఒక బాలికపై అత్యాచారం జరిగిందని తెలుసుకోవచ్చు. ఇన్ని జరుగుతున్నా నేరవ్యవస్థలోని నాలుగు విభాగాలు పోలీస్, ప్రాసిక్యూషన్, కోర్టులు, జైళ్లు తమ విధుల్లో సామూహిక వైఫల్యం చెందితే నేరస్థుల హృదయాల్లో శిక్ష అంటే ఏమాత్రం భయం ఉండదు. నేరాలను దర్యాప్తు చేసేది మొదట పోలీసులే. తమ దర్యాప్తులో ఎలాంటి దౌర్బల్యాలకు చోటీయరాదు. దీనికోసం మొదట క్రైమ్‌సీన్‌ను పరిరక్షించుకోవాలి. దీనివల్ల నిపుణులు సాక్ష్యాలను సరైన విధానంలో సేకరించ గలుగుతారు. దర్యాప్తు ప్రారంభదశలో నేరం నమోదు ఆలస్యమైతే తప్పు చే సినట్టే. కోల్‌కతా వైద్య విద్యార్థిని కేసులో ఎఫ్ఐఆర్ నమోదు 14 గంటలు ఆలస్యమైంది. అంతేకాకుండా క్రైమ్‌సీన్‌ను రక్షించకుండా ధ్వంసం చేశారు. దీంతో అనేక అనుమానాలు పెరిగి దర్యాప్తునే శంకించ వలసిన పరిస్థితి ఏర్పడింది. బద్లాపూర్ కేసులో కూడా ప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్న తరువాత పోలీస్‌లు దర్యాప్తుకు రంగంలో దిగారు. ఎఫ్ఐఆర్ నమోదులో వాంగ్మూలాలు రికార్డు చేయడంలో విపరీతమైన జాప్యం చేయడంపై బొంబాయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత క్రైమ్‌సీన్ నుంచి బలమైన సాక్ష్యాలను సేకరించడం, పరిశోధకుల పాత్ర, అత్యంత ప్రాధాన్యమైనవి. పోలీస్‌లు దర్యాప్తు పకడ్బందీగా నిర్వహించి సకాలంలో సంపూర్ణ న్యాయం అందేలా చూడవలసిన బాధ్య త రాష్ట్రాలదే. కానీ ఘరానా కేసులు ప్రజాందోళనల తరువాత ఎందు కు సిబిఐకి బదిలీ అవుతుంటాయి? అని ప్రశ్నించుకుంటే ఆయా రాష్ట్రాల దర్యాప్తు తీరుపై నమ్మకం లోపించడమే. దర్యాప్తు సరిగ్గా లే కుంటే ప్రాసిక్యూషన్‌కు కోర్టు విచారణల్లో అప్పీళ్లలో లీగల్ ప్రొసీడింగ్‌లో ప్రతిదశలో సమస్యలు ఎదురవుతాయి. చివరకు అత్యాచార నేరస్థులు చట్టం నుంచి తప్పించుకుని దర్జాగా బయటకు వెళ్లిపోతా రు. ప్రాసిక్యూషన్ నేరస్థులకు శిక్షపడేలా చేసినా, శిక్ష అమలులో విపరీతమైన జాప్యం చేస్తే బాధితులకు సకాలంలో న్యాయం అందించలేని వారవుతారు. 2012 ఢిల్లీ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు గ్యాంగ్ రేప్ నేరస్థులకు ఏడాదిలోగా విచారించి ఉరిశిక్ష విధించింది. కానీ నేరస్థులకు ఏడేళ్లకు కానీ ఉరిశిక్షఅమలు కాలేదు. దేశంలో నేరన్యా య వ్యవస్థ పునస్సమీక్షించిన తరువాత క్రూరమైన కేసుల్లో ఏడేళ్లు అంతకు మించి శిక్షపడనున్న కేసుల్లో ఫోరెన్సిక్ పరీక్షలు తప్పనిసరి చేశారు. 12 ఏళ్ల కన్నా తక్కువ వయసు బాలికలపై అత్యాచారానికి పాల్పడితే జీవితకాల శిక్షలేదా మరణశిక్ష పడుతుంది. ఈ కేసుల్లో ఫోరెన్సిక్ బృందం పరీక్షలను విస్తృతం చేశారు.

# ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన




మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్, వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన..

సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి మరియు తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు.

### మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్
### -నేడు ఆయన జయంతి (ఉపాధ్యయ దినోత్సవం)
### ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చిన

బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మె పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్స్‌లర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్.

1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు.

రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.

రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

## కార్యకర్త పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే బీరం



నాగర్‌కర్నూల్ : పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామని మరోసారి నిరూపించారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి. వివరాల్లోకి వెళ్తే..నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సున్నపుతాండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడుసీతారాం నాయక్ మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం బుధవారం సున్నపుతాండ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు సీతారామ నాయక్ మృతదేహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. సీతారామ నాయక్ మృతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. మంచి కార్యకర్తను కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ పాడెనుమాజీ ఎమ్మెల్యే మోయడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు భావోద్వేగానికి లోనయ్యారు. కార్యకర్తల ప్రతి కష్టంలోనూ తోడుగా అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని చూసి గర్వపడ్డారు.

## కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి : మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్ : వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ కూడా అధైర్యపడొద్దని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుఅన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో) నాగర్‌కర్నూల్ జిల్లాఅతలాకుతలమై, ఆస్తి, పంట నష్టం జరిగిన నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరధిలోని చౌటబెట్ల, నర్సింగరావుపల్లి, తాళ్ల నర్సింగాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముంపుబారిన పడ్డ పంట పొలాలు, కోతకు గురైన రోడ్లు, తెగిపోయిన బ్రిడ్జిలను క్షేత్రస్తాయిలో పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతటి విపత్తుపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి సాయాన్ని ప్రకటించాలని కోరారు.



## పని ప్రదేశంలో మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలి : కనిమొళి


న్యూఢిల్లీ: మహిళలు పనిచేసే చోట వేధింపుల నుంచి వారిని కాపాడాల్సిన అవసరం ఉందని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. తమకు భద్రత కల్పించాలని మహిళలు కోరడంలో ఎలాంటి తప్పు లేదని ఆమె పేర్కొన్నారు. కనిమొళి బుధవారం చెన్నైలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మహిళలపై ఏ రకమైన వేధింపులు జరగకుండా నిరోధించడం ముఖ్యమని చెప్పారు. పని ప్రదేశాల్లో మహిళలను కాపాడుకోవాలని ఇది మనందరి కర్తవ్యమని ఆమె పేర్కొన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన లైంగిక దాడి వ్యతిరేక బిల్లుపై సీపీఐ నేత అన్నీ రాజా బుధవారం స్పందించారు. చట్టాలను రూపొందించినా వాటిని పకడ్బందీగా అమలు చేయడమే మన దేశంలో ప్రధాన సమస్యని స్పష్టం చేశారు. భారత పార్లమెంట్ మహిళల గౌరవాన్ని కాపాడేందుకు ఎన్నో చట్టాలను ఆమోదించిందని గుర్తుచేశారు. మీడియాలో ఏ అంశం ప్రధానంగా వెలుగుచూసినా ఆపై ప్రజాగ్రహం వెల్లువెత్తితే మనం కొత్త చట్టాలను చేయడమో, ఉన్న చట్టాలకు సవరణ చేయడమో చూస్తుంటామని చెప్పారు. చట్టాలను సరిగ్గా అమలు చేయకపోవడమే సమస్య అని ఆమె పేర్కొన్నారు. చట్టాలను సరిగ్గా అమలు చేసేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులను రాష్ట్రాలకు చేపట్టకపోవడం మరో ప్రధాన అవరోధమని అన్నారు. కాగా, హత్యాచార కేసులో నిందితులకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. లైంగిక దాడి వ్యతిరేక బిల్లును బెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. దీనికి అపరాజిత బిల్లు అని పేరు పెట్టారు. లైంగిక దాడికి పాల్పడిన వారికి జీవితఖైదు విధించేలా చట్టాన్ని తీసుకొచ్చారు.




## అమెరికాలో ఘోర ప్రమాదం..

### ఇద్దరు హైదరాబాదీల సహా నలుగురు భారతీయుల సజీవ దహనం

అమెరికాలోని టెక్సాస్‌లో 5 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీలతో సహా నలుగురు భారతీయులు మరణించారు. అందరూ ఒకే వాహనంలో భారతీయ కార్‌పూలింగ్ యాప్ ద్వారా అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు ప్రయాణిస్తున్నారు. మృతులను హైదరాబాద్‌కు ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి, ఫరూక్ షేక్, లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌లుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొల్లిన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వైట్ స్ట్రీట్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది.. వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి ఎస్‌యూవీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ తర్వాత ట్రక్కు మరో నాలుగు వాహనాలను ఢీకొని డివైడర్‌ను ఢీ కొట్టింది. అందరూ తేరుకునేలోపే వాహన వాహనం మంటల్లో చిక్కుకుంది. నలుగురు భారతీయులు కారులో చిక్కుకున్నారు. మంటల కారణంగా నలుగురూ సజీవదహనమయ్యారు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా స్థానిక పోలీసులు వారిని గుర్తించారు. హైదరాబాద్ నివాసి ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి అతని స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని తమ బంధువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, లోకేష్ తన భార్యను కలవడానికి బెంటన్‌విల్లేకు వెళ్తున్నాడు. ఇక తమిళనాడుకు చెందిన ధరిణి వాసుదేవన్ టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివిన తర్వాత అక్కడే పనిచేస్తున్నారు. ఆమె బెంటన్‌విల్లేలోని తన మామ వద్దకు వెళ్తున్నారు. ఈ నలుగురూ కార్‌పూలింగ్ యాప్ ద్వారా కనెక్ట్ అయిన తర్వాత అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఆర్యన్ ఓరంపాటి ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాకు వెళ్లాడు. అతని తండ్రి సుభాష్ చంద్రారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారవేత్త. హైదరాబాద్‌కు చెందిన ఫరూక్ షేక్ మాస్టర్స్ డిగ్రీ కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లి బెంటన్‌విల్లేలో నివసిస్తున్నాడు. భారతీయులంతా కాలిపోయిన తర్వాత వారి మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. వారి శరీర భాగాల నమూనాలను ఆౌెం పరీక్ష కోసం ఉంచారు. 3 రోజుల తర్వాత కుమార్తె మృతి చెందిన విషయం ధరిణి తండ్రికి తెలిసింది. అంతకు ముందు, తన కూతురు అదృశ్యంపై సమాచారంతో ట్విట్టర్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహాయం కోరారు. కాగా, వారి అవశేషాలు భారత్ రప్పించేందుకు బాధితుల కుటుంబాలు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారుల సహాయాన్ని కోరుతున్నాయి.



# సింగ్ నగర్ లో దోచేస్తున్నారు...

విజయవాడ, సెప్టెంబర్ 4 విజయవాడలో సింగ్‌నగర్ మొదలుకొని చాలా ప్రాంతాల్లో ముంపుకు గురయ్యాయి. ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముంపుతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తాగు నీరు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు. ఇదే అవకాశంగా పాల ధరలు పెంచేశారు.ప్రభుత్వం అందించే ఆహార పదార్థాలు కూడా ముందుగా ఉండే కాంట్రిక, పాయకపురం వంటి ప్రాంతాల వరకు వెళ్తున్నాయి. శివారు ప్రాంతాలకు వెళ్లటం లేదు. విజయవాడలోని ఉడా కాలనీ, జర్నలిస్టు కాలనీ, రాజీవ్ నగర్, అజిత్ సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, ఎల్‌బిఎస్ నగర్, వాంబే కాలనీ, మధురా నగర్, అయోధ్య నగర్, రామకృష్ణాపురం, కొత్త రాజరాజేశ్వరిపేట, పాత రాజరాజేశ్వరి పేట, పైపుల రోడ్డు, శాంతి నగర్, ప్రశాంతి నగర్, జక్కంపూడి, పాతపాడు, పి.నైనవరం, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్టు, వించిపేట, భవానీపురం, హెచ్‌బీ కాలనీ, విద్యాధరపురం ప్రాంతాల్లో ఉన్న వారికి సాయం కాస్త జాప్యం జరుగుతోంది. అయితే ఇదే అదునుగా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ధరలను పెంచి అమ్ముతున్నారు.విజయవాడ సింగ్‌నగర్‌లో వ్యాపారులు, ప్రైవేటు బోట్ నిర్వాహకుల చేతివాటం. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు సేకరించి అమ్మకం. శివారు కాలనీలకు ఆహారం తీసుకువెళ్లి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు. పంపిణీలో అధికారుల పర్యవేక్షణ లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఆహారం పంపిణీ చేయలేదని బాధితుల ఆందోళన చేస్తున్నారు. బ్లాక్‌లో ఆహారం కొనుగోలు చేసేందుకు కూడా డబ్బులు లేవని బాధితులు లబోదిబోమంటున్నారు.వరదల్లో మునిగిపోయిన విజయవాడలో పాల కొరత తీవ్రమైంది. ఇదే అదునుగా వ్యాపారలు రేట్లు పెంచేశారు. అరలీటర్ పాల ప్యాకెట్ రూ.70-80 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లలో చిన్న పిల్లలు ఉన్నారని, కనీసం ఒక్క పాలు ప్యాకెటైనా ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. విజయ డెయిరీ, కృష్ణ మిల్క్ యూనియన్ సెంట్రల్ ఆఫీస్ మునిగిపోవడంతో లక్షల లీటర్ల పాలు, పెరుగు ప్యాకెట్లు చెడిపోయాయి.మరోవైపు ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోటు యజమానులు డబ్బులు వసూలు చేస్తున్నారు. దగ్గర ప్రాంతాలకు అయితే రూ.500 నుండి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. అదే దూర ప్రాంతాలకు అయితే రూ.1,500 నుండి రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారని బాధితులు తెలుపుతున్నారు. కనీసం మానవత్వం కూడా లేకుండా ధర పెంచి మంచినీళ్లు, పాలు వంటి నిత్యావసర వస్తువులు అమ్ముతున్నారని, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముంపు ప్రాంతాల్లో మంత్రులు, రాజకీయ నాయకుల పర్యటనలతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వీవీఐపీల ప్రోటోకాల్ కోసం పోలీసుల ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. రూట్ క్లియర్ చేయడం, ట్రాఫిక్ క్లియర్ చేయడం కోసం పోలీసులు శ్రమిస్తున్నారు. సమీక్షల్లో అధికారులు, క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందితో సమన్వయం కుదరటం లేదు. రాజకీయ పర్యటనలకు బ్రేక్ ఇస్తే సహాయ చర్యల్లో వేగం పుంజుకునే అవకాశముంది. పలు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందికి కమ్యూనికేషన్ రేడియోలు అందలేదు. బ్యాటరీలు అయిపోవడంతో క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం అందటం లేదు. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో కేటాయించిన విధుల్లో అందుబాటులో సిబ్బంది లేరు.హైకోర్టు, ఏపీ సెక్రటేరియట్‌కు వెళ్ళే కరకట్ట దారిలో మంతెన ఆశ్రమం వద్ద కరకట్టకు పడ్డ గండిని యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేస్తున్నందున ఏపీ హైకోర్టుకు రెండు రోజులు సెలవు ప్రకటించాల్సిందిగా, హైకోర్టు రిజిస్ట్రార్‌కు గుంటూరు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి లేఖ రాశారు. గతంలో ఎన్నడూ లేనంతగా కృష్ణా నదిలో వరదలు వచ్చాయని, 11.4 లక్షల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీకి వచ్చిపడిందని అందులో పేర్కొన్నారు. హైకోర్టు, ఏపీ సెక్రటేరియట్‌కు వెళ్ళే కరకట్ట దారిలో మంతెన ఆశ్రమం వద్ద కరకట్టకు పడ్డ గండి పడిందని, దాన్ని మరమ్మత్తులు చేసేందుకు రెండు రోజులు హైకోర్టుకు సెలవు ప్రకటించాలని కోరారు. అందులో భాగంగా రెండు రోజులు సెలవు ప్రకటించారు.విజయవాడలోని వరద బాధితులకు దాదాపు 75 వేల అత్యావసర మందుల కిట్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరంలో 14 మెడికల్ రిలీఫ్ క్యాంపులకు అత్యవసర కిట్లు చేరవేశామని అన్నారు. మరికొన్ని కిట్లను 10 మొబైల్ మెడికల్ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు.

# విశాఖ కూటమిలో లుకలుకలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, టిడిపి కూటమి ప్రభుత్వంపై జనసేన ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారా? నియోజకవర్గంలో తన మాట చెల్లుబాటు కాకపోవడం పై అసంతృప్తికి గురయ్యారా? టిడిపి నేతల పెత్తనాన్ని సహించలేకపోతున్నారా? అందుకే తిరుగుబాటుకు ప్రయత్నించారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జనసేన ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించింది. పొత్తులో భాగంగా 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ శత శాతం విజయం సాధించింది. రాష్ట్ర క్యాబినెట్లో మూడు మంత్రి పదవులను పొందింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక నాలుగు శాఖలతో పాటు డిప్యూటీ సీఎం హోదాను దక్కించుకున్నారు. టిడిపి తో పొత్తు మరో 10 ఏళ్ల పాటు కొనసాగాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. అప్పుడే ఈ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. జనసేన శ్రేణులకు సైతం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. టిడిపి తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పుడు ఏకంగా ఒక ఎమ్మెల్యే టిడిపి కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంతకీ ఆయన ఎవరంటే పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు. ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి జనసేనలో చేరారు ఆయన. పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించారు. ఇప్పటికే అక్కడ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు. ఆయనకు కాదని పంచకర్ల రమేష్ బాబుకు జనసేన తరఫున టికెట్ ఇచ్చారు. దీంతో బండారు సత్యనారాయణమూర్తి మాడుగులకు షిఫ్ట్ కావాల్సి వచ్చింది. అయితే ఎన్నికల్లో ఇద్దరూ గెలిచారు.అయితే పెందుర్తి నియోజకవర్గం లో తన మాట చెల్లుబాటు కావడం లేదన్నది పంచకర్ల రమేష్ బాబు బాధ. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున ఇదే పెందుర్తి నుంచి గెలిచారు పంచకర్ల. బండారు సత్యనారాయణమూర్తి పై గెలవడంతో వారిద్దరికీ అంతగా పడడం లేదు. అందుకే ఈ ఎన్నికల్లో తనకు టికెట్ కావాలని పట్టు పట్టారు బండారు సత్యనారాయణమూర్తి. చివరకు మాడుగుల వెళ్లినా..పెందుర్తి పై మాత్రం ఆశ చావలేదు. అందుకే పెందుర్తి పై పట్టు సాధిస్తున్నారని తెలుస్తోంది. దీంతో పంచకర్ల రమేష్ బాబు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.తాజాగా పోలీస్ అధికారుల బదిలీలు జరిగాయి. తన నియోజకవర్గంలోని పెందుర్తి, పరవాడ పోలీస్ స్టేషన్లలో అనుకూల అధికారుల కోసం లేఖలు ఇచ్చారు ఎమ్మెల్యే. కానీ ఎమ్మెల్యే సిఫారసులు పని చేయలేదు. ఎమ్మెల్యే ఒకరిని సూచిస్తే.. మరొకరిని అక్కడ నియమించారు. సాక్షాత్ హోం మంత్రి వంగలపూడి అనిత ఇదే జిల్లాకు చెందినవారు. తన లేఖలకు కనీస పరిగణలోకి తీసుకోకపోవడంతో పంచకర్ల రమేష్ బాబు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. అందుకే పోలీస్ శాఖ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తనకున్న సెక్యూరిటీని సరెండర్ చేశారు. దీంతో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఒక విధంగా చెప్పాలంటే టిడిపి కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసినట్టేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి.పెందుర్తిలో పట్టు బిగించాలన్నది బండారు సత్యనారాయణమూర్తి ప్రయత్నం. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు పరవాడ నియోజకవర్గం ఉండేది. అక్కడ సుదీర్ఘకాలం బండారు సత్యనారాయణమూర్తి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. అతనికి అక్కడ క్యాడర్ ఉంది. అందుకే తన రాజకీయ వారసుడిగా కుమారుడిని తెరపైకి తెచ్చారు. ఎన్నికల్లో కుమారుడికి టికెట్ ఇవ్వాలని చంద్రబాబుకు కోరారు. అయితే పెందుర్తి జనసేనకు కేటాయించడంతో కొద్దిరోజులపాటు బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తికి గురయ్యారు. వైసీపీలో చేరతారని కూడా ప్రచారం సాగింది. అయితే కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సత్యనారాయణమూర్తికి స్వయానా అల్లుడు. కింజరాపు కుటుంబం ఒత్తిడి మేరకు బండారు సత్యనారాయణమూర్తికి అప్పటికప్పుడు మాడుగుల టిక్కెట్ ఇచ్చారు. అయితే మాడుగులలో గెలిచినా.. పెందుర్తి పై మాత్రం ఆశ తగ్గలేదు. అందుకే తన మాటని నెగ్గించుకోవాలని భావిస్తున్నారు. అయితే ఇది పంచకర్ల రమేష్ బాబుకు ఇబ్బందిగా మారుతోంది. అందుకే ఆయన ప్రభుత్వానికి తెలియచెప్పేలా తన సెక్యూరిటీని సరెండర్ చేయడం విశేషం.

## భారీ వర్షాలకు జిల్లాలో నిండుకుండలా మారిన జలాశయాలు

ఏలూరు,ఏలూరు జిల్లాలోని జలాశయాలు భారీ వర్షాలకు నిండుకుండాల మారాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద 31.100 మీటర్ల నీటిమట్టం నమోదు అయింది. స్పిల్ వే నుండి 6,79,782 క్యూసెక్కుల గోదావరి జలాలు దిగువకు విడుదల చేస్తున్నారు. చింతలపూడి వద్ద తమ్మిలేరు జలాశయంలో ఇన్ఫ్లో 2519, ఔట్ ఫ్లో 3839 క్యూసెక్కులు. జంగారెడ్డిగూడెం వద్ద ఎర్ర కాల్వ జలాశయంలో ఇన్ ఫ్లో 1505, ఔట్ ఫ్లో 1747 క్యూసెక్కులు.

## అనంతలో క్రికెట్ సందడి

అనంతపురం అనంత క్రీడా గ్రామం క్రికెటర్లతో సందడిగా మారింది. దులీప్ ట్రోఫీ ఈ నెల 5 నుంచి క్రికెట్ మ్యాచులు ప్రారంభం అయి 22 వరకూ జరగనున్నాయి. ఇందులో స్టార్ క్రికెటర్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, అర్ష దీప్ సింగ్, సాయి సుదర్శన్ తదితరులు పాల్గొంటారు. దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీల సందర్భంగా ఉదయం భారత్ – సి, డి – జట్ల క్రీడాకారులు వేర్వేరు సెషన్లలో ముమ్మరంగా నెట్ ప్రాక్టీసు చేస్తున్నారు. భారత్–సి జట్టు సారథి రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలో.. అలెగ్జాండర్ హోటల్ నుంచి బస్సులో అనంత క్రీడా గ్రామం చేరుకున్నారు. నెట్ ప్రాక్టీసు, క్యాచింగ్, బంతి త్రో, ఇతర వ్యాయామాలు చేశారు. భారత్–డి జట్టు శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో క్రికెటర్లు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ సాధన చేస్తున్నారు. మరోవైపు మైదానం, పెవిలియన్ ను బీసీసీఐ అధికా రులు స్వాధీనం చేసుకున్నారు.

## అపత్తులో ఆదుకుంటున్న డ్రోన్లు

విజయవాడ ఇంతవరకు ప్రమాదాన్ని అంచనా వేయడానికి.. పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి మాత్రమే ఈ డ్రోన్స్ను వాడేవాళ్లం. ఇప్పుడు ఏకంగా వరదలో చిక్కుకుపోయిన వారికి సహాయం అందించేందుకు కూడా ఉపయోగపడతున్నాయి డ్రోన్స్.విజయవాడ వరద భాదితు లకు ఆహారం డ్రోన్ సాయంతో అందించారు అధికారులు.ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. చాలా ప్రాంతాల్లో ఇలానే డ్రోన్తో సేవలు అందిస్తున్నాయి రెస్క్యూ టీమ్స్. డ్రోన్తో వరద బాధితులకు సాయం అందించడం చాలా ఏళ్లుగా సాగుతుంది. కానీ గతంలో అక్కడ క్కడ మాత్రమే ఈ ఫెసిలిటీస్ ఉండేవి. కానీ.. ఇప్పుడు డ్రోన్లను వినియోగించడం చాలానే పెరిగిందని చెప్పాలి. రెస్క్యూ టీమ్స్ చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్స్ ఈజీగా వెళ్లిపోతున్నాయి. ఫుడ్ ప్యాకెట్స్, లైఫ్ జాకెట్స్, అవసరమైన తాళ్లు, మందులు, మంచినీరు.. ఇలా పని ఏదైనా క్షణాల్లో చేసేస్తున్నాయి డ్రోన్స్.

# ప్రాజెక్టుల పేర్లు కొనసాగించాలి

నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు.మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదుంది. జగన్ కోరిక గౌతమ్ రెడ్డి ఆత్మకూరు అసెంబ్లీ నుంచి పోటీ చేశారు.. తర్వాత మంత్రిగా చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. సంగం బ్యారేజ్ కి మేకపాటి గౌతమ్ రెడ్డి అని పేరు పెడితే.. దాన్ని తొలగించడం దారుణం. నెల్లూరు బ్యారేజ్ కి నిజాయతీపరుడుగా ఉన్న నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరు పెడితే దాన్ని సైతం తీసేయ్యడం దుర్మార్గం. అధికారం శాశ్వతం కాదనే విషయాన్నీ చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలి.. ఇచ్చిన ఒక్క హామిని కూడా అమలు చెయ్యకపోవడం చంద్రబాబు ట్రాక్ రికార్డు. రాజశేఖరరెడ్డి చెప్పినవి.. చెప్పానవి కూడా చేసారు.. అయన బతికి ఉంటే మూడుసార్లు సీఎం అయ్యేవారు.. రాష్టం విడిపోయేది కాదు. అమరావతిలో రాజధాని కరెక్ట్ కాదని శివరామకృష్ణ కమిటీ చెప్పినా చంద్రబాబు వినలేదు.. ఇప్పుడు వరదలతో మునిగిపోయింది. శేష జీవితంలో అయినా.. ప్రజలకు మేలు చెయ్యాలనే ఆలోచన చంద్రబాబుకి రావాలి. నా వంతు సాయంగా ఏపీకి 25 లక్షలు, తెలంగాణకి 25 లక్షలు విరాళం ఇస్తున్నానని అన్నారు.మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ గౌతమ్ రెడ్డి కోసమే జగన్ మూడు సార్లు జిల్లాకి వచ్చారు.. అయన జ్ఞాపకర్థం సంగం బ్యారేజ్ కి ఆ పేరు పెట్టారు. వాటిని తొలగించడం వల్ల చంద్రబాబుకి వచ్చిన లబ్ది ఏంటో అర్ధం కాలేదు. బ్యారేజ్ లకి పేర్లు మార్చడం పై చంద్రబాబు మీద ప్రజలు అసహ్యాహించుకుంటున్నారు. రెండు బ్యారేజ్ లకి ఆవే పేర్లు కొనసాగించాలని అన్నారు.

# విజయవాడ వరద భాదితులను ఆదుకోవడానికి సర్వం సిద్ధం

**తాడేపల్లిగూడెం లోని దాతలు ఇంకా ముందుకు రావాలి**

**- వరద బాధితుల కోసం తాడేపల్లిగూడెం నియోజవర్గం నుంచి ఎటువంటి సహాయక కార్యక్రమాలైన చేయడానికి సిద్ధం**

**- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

తాడేపల్లిగూడెం,ఇటీవల భారీ వర్షాలకు వరద ముంపుకు గురైన విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గాజువాక ఎమ్మెల్యే పళ్ళ శ్రీనివాసులతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరద బాధితులకు సహాయార్థం తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి ఎటువంటి సహాయక కార్యక్రమాలైనా చేయడానికి సిద్ధమంటూ ఆయన అధినాయకులకు సమాచారం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కలిసిన అనంతరం ఆయన నేరుగా వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి సహాయ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. తాడేపల్లిగూడెం నుంచి ఇప్పటికే లక్ష వరకు ఆహార పట్ల సిద్ధం చేసిన ఆయన వివిధ గ్రామాలు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నుండి వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ బ్రెడ్స్ వంటివి తాడేపల్లిగూడెం నుంచి తరలించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం లోని దాతలు ఇంకా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వరద తీవ్రత తగ్గేంత వరకు విజయవాడలోనే ఉండి తాడేపల్లిగూడెం నుండి అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## గుడ్లవల్లేరుకు ఐటీ నిపుణులు

విజయవాడ, సెప్టెంబర్ 4, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఘటన అభూత కల్పనా? ఉద్దేశపూర్వకంగా సృష్టించిందా? ఆకతాయిలు అలా ప్రచారం చేశారా? దానికి రాజకీయ రంగు పులుముకుందా? ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం జరిగిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు 3,000 మంది చదువుకుంటున్నారు. బాలికల హాస్టల్లో వాష్ రూమ్లలో సీక్రెట్ కెమెరాలు అమర్చారు అన్నది ఒక ప్రచారం. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులు రాత్రంతా ఆందోళన చేశారు. ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ కాలేజీని సందర్శించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో నిందితులకు అవకాశం ఇవ్వొద్దని.. నిజా నిజాలు నిగ్గు తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటివరకు సీక్రెట్ కెమెరాల జాడలేదు. అనుమానిత విద్యార్థుల నుంచి కూడా ఎటువంటి ఆధారాలు దొరకలేదు. అదే సమయంలో వందలాది వీడియోలు బయటకు వెళ్లిపోయాయి అన్న ప్రచారానికి.. నిజం చేస్తూ ఒక్క ఆధారం కూడా దొరకలేదు. నిజంగా సీక్రెట్ కెమెరాలు పెట్టుంటే.. ఈపాటికే అవి తప్పకుండా బయటకు వచ్చేవి. కానీ అటువంటివి సోషల్ మీడియాలో సైతం కనిపించలేదు. అయితే కాలేజీ యాజమాన్యంతో పాటు నిందితులను ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తుందని వైసిపి సోషల్ మీడియాలో ఆరోపిస్తోంది. విపరీతంగా పోస్టులు పెడుతూ వైరల్ చేసింది. దీంతో అసలు ఏం జరిగిందనే దానిపై స్పష్టతనివ్వాల్సిన అవసరం పై ఏర్పడింది.అయితే ఈ ఘటనపై విద్యార్థినులలో ఒక రకమైన అనుమానం నెలకొంది. దానిని నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. ఇది ఆ కాలేజీలో చదువుకున్న విద్యార్థినులందరి భవిష్యత్తుపై ప్రభావం చూపించే ఆరోపణ. ప్రభుత్వం చిన్న విషయంగా తీసుకోలేని పరిస్థితి. అందుకే జాతీయస్థాయి సైబర్ సెక్యూరిటీ నిపుణులను పిలిచి మరి అణువణువు శోధిస్తోంది. ఇటీవల సైబర్ సెక్యూరిటీ నిపుణులు కాలేజీని సందర్శించారు. ఫోన్ టవర్ల దగ్గర నుంచి వెళ్లిన మెసేజ్ లు, ఆ కాలేజీలో ఇంటర్నెట్ వాడిన ఫోన్ల కార్యకలాపాలు, ఎవరెవరు వీడియో రికార్డులు చేశారు? ఆ వీడియోలేమిటి అనే వివరాలను మొత్తం బయటకు తీశారు. సర్వర్ రూములో నిక్షిప్తమైన సమాచారాన్ని కూడా విశ్లేషించారు. మొత్తంగా ఆ కాలేజీ నుంచి ఫోన్ల ద్వారా జరిగిన ప్రతి వ్యవహారాలను విశ్లేషించారు.అక్కడితో దర్యాప్తు ఆగలేదు. వీడియోలు రికార్డు చేశారా? లేదా? అనే విషయాన్ని నిగ్గు తేల్చేందుకు మరో సాంకేతిక నిపుణుల బృందం ఢిల్లీ నుంచి వచ్చింది. వారు కూడా క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. సీక్రెట్ కెమెరాలు పెట్టగలిగారా? రికార్డు చేశారా? అనే అంశాలపై సాంకేతిక సమాచారాన్ని బయటకు తెస్తున్నారు.మరోవైపు సమాంతరంగా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న పదిమంది విద్యార్థుల ఫోన్లు, లాప్ టాప్ లు సహా మొత్తం డిజిటల్ హిస్టరీని బయటకు తీసి విచారణ జరుపుతున్నారు.వాస్తవానికి ఇది రాజకీయ రంగు పులుముకుంది. ప్రధానంగా వైసీపీ సోషల్ మీడియా విద్యార్థుల్లో ఒక రకమైన అనుమానాలను పెంచింది. తల్లిదండ్రుల్లో కూడా ఒక రకమైన భయాన్ని సృష్టించింది. అందుకే ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. అయితే ఇది అనవసర కల్పిత చర్య అని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.అందుకే సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి లోకేష్ ఇటీవల స్పందించారు. ఇదంతా వైసిపి సృష్టించిన ఫేక్ అని ప్రకటించారు. సైబర్ నిపుణులు నివేదిక తర్వాత ఈ ఘటన వెనుక ఏం జరిగిందనే దానిపై ప్రభుత్వం స్పష్టత నివ్వనుంది. ముఖ్యంగా విద్యార్థినులతో పాటు తల్లిదండ్రుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించనుంది.

## అకాల వర్షాలు వల్ల మళ్ళీ బుడమేరుకు వరద

**ప్రజలంతా అప్రమత్తగా ఉండాలి**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విజ్ఞప్తి**

గొల్లపూడి,అకాల వర్షాల వల్ల మళ్ళీ బుడమేరుకు వరద ప్రవాహం పెరిగిందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున మైలవరం, ఎగువ ప్రాంతమైన ఖమ్మం ఏరియాలో వర్షాలు పడటం వల్ల బుడమేరుకు 10 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందన్నారు. కొండపల్లి శాంతినగర్ ఎర్రబడ్జి వద్ద ఉన్న చెరువు కట్ట కూడా తెగిందన్నారు. దయచేసి చెరువుల గండ్లను తక్షణమే పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. అలానే బుడమేరు పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తను గొల్లపూడి మార్కెట్ యార్డులో ఉన్నానని అన్నారు. జక్కంపూడి కాలనీలోని వరద బాధితులకు ఆహారాన్ని పంపించే పనిలో నిమగ్నమై ఉన్నానన్నారు. అత్యవసరమైతే తనకు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ముంపు గ్రామాలలోఎస్పీ,కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

ఏలూరు ,భారీ నుంచి అతి భారీ వర్షాలు వాతావరణంలో మార్పుల వలన తమ్మిలేరు రామిలేరు ఇతర వాగుల ద్వారా కాలువల ద్వారా కొల్లేరు సరస్సులోకి వచ్చి చేరడం తో ఏలూరు జిల్లా ఎస్పీ కె పి ఎస్ కిషోర్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఇతర అధికారులతో కొల్లేరు గ్రామమైన కోమటి లంక గ్రామము, మణుగులూరు, పెద్దడ్ల గాడి మరియు తిరుగుతునూరు లంక గ్రామాలను ముంచేత్తుతున్న వరద నీరును వలన ఏదైనా ప్రమాదం ఉండే అవకాశాలు ఉన్న దానిపై ప్రజలకు అవగాహనను కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల మూలముగా కొల్లేటి సరస్సు లోకి ఎక్కువగా వరద నీరు వచ్చి చేరడం వలన లంక గ్రామాలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగేటటు వంటి ప్రమాదాలు ఉన్నట్లు,ప్రజలు నీటి ప్రవాహాన్ని అడ్డంగా దాటడం సాహసించవద్దని, ప్రజలకు అవసరమై నిత్యవసర వస్తువులను వారికి పెద్ద భోటు ల ద్వారా వారి వద్దకే అందించే ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేస్తుందని, ప్రజలు చిన్నచిన్న అవసరాల కొరకు నీటి ప్రవాహాన్ని దాట వద్దని అన్నారు. ప్రజలకు ఏదైనా అవసరాలు ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్ ను సంప్రదించిన ఎడల అధికార యంత్రాంగం వెంటనే ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తుందని, లంక గ్రామాలలో నివాసం ఉంటున్న గ్రామ ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాగే వరద నీరు వచ్చే సమయంలో మేము తిరిగాము అనే ఒక ధీమాతో కాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు.

## బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమైన జేపీసీ..





కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 విభారె న్యూస్..జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జేపీసీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా శాఖ తరపున పాల్గొని విపత్కర పరిస్థితి లో ఉన్న విజయవాడ లోని వరద బాధితులకు ఒకరోజు జీతం ఇవ్వడానికి మేమంతా వివిధ సంఘాల వాళ్ళు తో సహా మానవతా దృక్పథంతో సన్నద్ధంగా ఉన్నామని జాయింట్ కలెక్టర్ కి తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆప్తా జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఆర్ సేవాలాల్ పాల్గొనడం జరిగింది.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు: ఆప్టా...

కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 విభారె న్యూస్.. సెప్టెంబర్ 05 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి గాను కర్నూలు జిల్లా నుంచి 23 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి సమూయేలు ప్రకటించి ఉన్నారు. ఈ 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు తమ హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షులు మధుసూదన రెడ్డి ప్రధాన కార్యదర్శి ఆర్. సేవలాల్ నాయక్ పత్రిక ముఖంగా తెలియజేశారు. వీరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన విద్యాశాఖ అధికారులకు కర్నూలు జిల్లా కలెక్టర్ వారికి వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ 23 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మిగతా ఉపాధ్యాయని ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అలాగే వారి విద్యా బోధన లో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆప్టారాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు,జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదన రెడ్డి, సేవాలాల్ నాయక్ ఆశాభావం వ్యక్తపరిచారు.

## ఆళ్లగడ్డ పట్టణంలో హుబిలక షార్ట్ ఫిలిం టీజర్ విడుదల..

ఆళ్ళగడ ప్రతినిధి సెప్టెంబర్ 04 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం షాది ఖానా సమీపంలో ఉన్న దర్బార్ టీ స్టాల్ నందు హుబిలక తుమారే లియే మేర ప్యార్ షార్ట్ ఫిలిం ను ఆళ్లగడ్డ కౌన్సిలర్ హుస్సేన్ భాష , డాక్టర్ సుబ్రహ్మణ్యం, అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి.అమీర్ భాష టీజర్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాషకు మంచి టాలెంట్ ఉందని భవిష్యత్తులో మంచి దర్శకుడు అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆళ్లగడ్డ కు చెందిన యువకుడు ఈ స్థాయికి రావడం చాలా సంతోషకరమన్నారు. ఇలాగే భవిష్యత్తులో కూడా మంచి లఘు చిత్రాలు ఆవిష్కరణ చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి.అమీర్ భాష మాట్లాడుతూ హుబిలక షార్ట్ ఫిలిం తీస్తున్న నా కుమారుని అందరూ ఆశీర్వదించాలని అలాగే తన టాలెంట్ను ప్రోత్సహించాలని కోరారు. హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాష మాట్లాడుతూ నేడు ఈ షార్ట్ ఫిలిం టీజర్ విడుదల సందర్భంగా ఆళ్లగడ్డ ప్రజలందరి ఆశీస్సులు ప్రోత్సాహం కావాలని ఆశిస్తూ ఈ షార్ట్ ఫిలిం ఈనెల ఆరవ తేదీన రాత్రి యూట్యూబ్లో విడుదల చేస్తాము అందరూ ఇచ్చించి మీయొక్క ఆదరాభిమానాలు కావాలని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో నిర్మాత బ్రహ్మయ్య, కెమెరామెన్ గఫర్ బాబా, హుబిలక షార్ట్ ఫిలిమ్స్ సభ్యులు,నజీర్, రామయ్య, హనీఫ్, వీరేశ్వర్, మహమ్మద్ హుస్సేన్, సాదిక్ భాషా, మాబు హుస్సేన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# లెవియుగ్ యువతకు స్ఫూర్తి దాయకం

- ఘనంగా లెవియుగ్ వార్షికోత్సవ వేడుకలు
- కెవి సుబ్బారెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ నాగరాజు..
- పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరిత










ఆగస్టు 4.. కర్నూల్ లెవియుగ్ యువతకు స్ఫూర్తి దాయకమని కర్నూలు ఎంపీ నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌడ్ చరితలు పేర్కొన్నారు. బుధవారం లెవియుగ్ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా కెవి సుబ్బారెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ నాగరాజు.. పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరిత, కె.వి. సుబ్బా రెడ్డి విద్యాసంస్థల అధినేత కెవి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెవియుగ్ సంస్థ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఇంత ఘనం గా నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. 500 మందికి పైగా వ్యవస్థాపకులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. తమ సొంత స్టార్టప్ వెంచర్లను ప్రారంభిం చేందుకు యువతను ప్రేరేపించడం, ప్రోత్సహించడం అనే లక్ష్యంతో ఎదుగుతున్న స్టార్ట్ అప్ ఆంధ్రప్రదేశ్ లో ఇంతటి బృహత్తర కార్య క్రమా నికి శ్రీకరం చుట్టడం ద్వారా పలువురి మన్ననలు పొందిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను స్టార్టప్లుగా మార్చడానికి అవసరమైన సేవలు యాక్సిస్ చేయగల ప్లాట్ఫారంను అందించడం ద్వారానే అందరికీ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అందు బాటులోకి తీసుకురావాలని లేవ్ లక్ష్యంగా పెట్టుకుందని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎవరైనా తమ వ్యవస్థాపక ప్రమాణాన్ని కేవలం స్మార్ట్ ఫోన్ తో వెలిగించ వచ్చు. ఆలోచనలను అభివృద్ధి చెందుతున్న వెంచర్లుగా మార్చుకునే అవకాశం మెండుగా ఉంటుంది.

# సిక్కోలుకు వరం ఓ బ్రాండ్

- కళింగ కోమటి జాతికి జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చారు
- నగర విస్తరణ, అభివృద్ధిలో వరం కృషి స్ఫూర్తిదాయం
- ఆయన కుటుంబ సభ్యులు సేవలను కొనసాగించడం అభినందనీయం
- గ్లోబల్ ప్రచారాలను నమ్మవద్దు... నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- వరం జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు చిరువ్యాపారులకు 15తోపుడు బళ్లు పంపిణీ
- అన్నాక్యాంటీన్‌కు రూ. మూడు లక్షలు విరాళం



శ్రీకాకుళం సిక్కోలు రాజకీయాల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ, కళింగ కోమటి సామాజిక వర్గంలోనూ, పేదల ప్రజల మనసుల్లోనూ అంధవరపు వరహానర్సింహం (వరం) ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించుకున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వరం జయంతిని పురస్కరించుకొని నగరంలోని అంధవరపు వరహానర్సింహం హైస్కూల్‌లో, ఏడురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహాలకు పూలమాల వేసి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఏడురోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మనం చేసిన సేవలే చరిత్రలో చిరకాలం నిలిచిపోతాయనడానికి వరం జీవితమే నిదర్శనమని అన్నారు. ఆయన తన మంచితనం, నడవడిక, ప్రవర్తనతో కళింగ కోమటి జాతికి జాతీయ, రాష్ట్రస్థాయిలో కీర్తిని, ఖ్యాతిని తెచ్చిపెట్టారని కొనియాడారు. భవిష్యత్ తరాల అవసరాలను ముందే గుర్తించిన మహోన్నత వ్యక్తిత్వం వరం సొంతమని తెలిపారు. నగర విస్తరణ, అభివృద్ధిలో వరం చూపిన కృషి తమకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని చెప్పారు. అధికార పార్టీలో ఉన్నా, ప్రతిపక్ష పార్టీలో ఉన్నా వరంనకు అంతే అభిమానులు ఉండేవారని చెప్పారు. అటువంటి గొప్ప వ్యక్తి ఆశయాలను, ఆలోచనలకు ముందుకు తీసుకెళ్లే దిశగా ఆయన కుటుంబ సభ్యులు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి తాను, కింజరాపు కుటుంబం అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. గ్లోబల్ ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఇటీవల ఓ వ్యక్తి పుట్టినరోజు వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపినప్పుడు తాను తప్పు చేసినట్టు కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఇది తగదన్నారు. ఎన్నికల సమయంలో వారి ఓట్ల కోసం వారి ఇళ్ల వద్దకు వెళ్లానని, వారు తప్పు చేస్తే చెప్పాలి తప్ప ఇటువంటి చౌకబారు ప్రచారాలు తన వద్ద చెల్లదని చెప్పారు. అనంతరం వరం కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానస పుత్రిక అన్నాక్యాంటీన్‌కు రూ. మూడు లక్షల చెక్కును ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. అదేవిధంగా నిరుపేదల జీవనోపాధి కోసం 15 తోపుడు బండ్లను వారికి అందించారు. కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ వరం నిజాయితీగా రాజకీయాలు చేయడం వల్లే ఆయనను ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటున్నారని తెలిపారు. వారి కుటుంబం కూడా అదే స్థాయిలో సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని చెప్పారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ సాయం కావల్సిన సాటి వారికి తోచిన సాయం చేయాలని నాన్న చెప్పిన మాటలకు కట్టుబడి తమ కుటుంబ సభ్యులమంతా ఒకే మాటపై నిలబడి వరం చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ హరగోపాల్, జామి భీమశంకర్, పీఎం జె బాబు, పాండ్రంకి శంకర్, పీవీ రమణ, కొర్ను ప్రతాప్, అంబటి లక్ష్మీరాజ్యం, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, నాగేంద్రయాదవ్, కెల్ల కొండలరావు, సిరిపురపు హరి, అర్జున్, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, బిజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, వరం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలో బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభం




శ్రీకాకుళం : బుధవారం శ్రీకాకుళం జిల్లాలో బిజెపి సాధారణ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ జరిగింది. నగరంలోని 80 ఫీట్ రోడ్ లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వర రావు అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ, 2014 లో శ్రీకాకుళం జిల్లాలో సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున జరిగిందని, ఇప్పుడు కూడా అంతకు మించి సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ నాయకులను కోరారు. ఎవరు పార్టీలో చేరాలన్నా పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయని, మంచి వ్యక్తులతో సంస్థాగత నిర్మాణం చేసుకోవాలని కోరారు. పార్టీ నాయకులకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వర రావు, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, జిల్లా ఇంఛార్జ్ ఎన్. విజయానంద రెడ్డి, బిజెపి జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనరు చల్లా వెంకటేశ్వర రావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అట్టాడ రవిబాబ్జి, చింతపల్లి దుర్గారావు గాంధి, సలాన రాఘవ రావుతో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.




సీఎం సహాయ నిధికి వరద బాధితుల కోసం 5 లక్షలు విరాళం ప్రకటించిన ఓఒం భూమా అఖిలప్రియ గారు

## జిల్లా యోగాసన పోటీల విజేతలు కె.జి.బి.వి. ఆస్వరి.

### జిల్లా యోగాసన సంఘం అధ్యక్షుడు శివరాజ్.



కర్నూల్, స్పోర్ట్స్ న్యూస్: రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి అందరు పాఠశాలల యోగ పోటీలు బుధవారం రోజున మూశాయి జిల్లా అంతర్ పాఠశాలల యోగా పోటీలలో విజేతలుగా కె జి బి వి అస్వరి విజేతలుగా నిలువగా ద్వితీయ స్థానంలో కె జి బి వి కృష్ణగిరి నిలిచాయి కె జి బి వి పంచలింగాల తృతీయ స్నానంతో సరిపెట్టుకున్నాయి. వ్యక్తిగత క్రీడాంశాలలో రాణించిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి బ్రిజేష్ సింగ్ పోటీల్లో పాల్గొన్న గెలిచిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ జిల్లాలో రాబోయే కాలంలో జాతీయస్థాయి యోగా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు యోగాను అభివృద్ధి పరిచేందుకు వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని తెలిపారు జిల్లాలో యోగాను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ పాఠశాలల సహకారం ఎంతో అవసరం అని తెలిపారు జిల్లాస్థాయి యోగాసన పోటీలకు పరిశీలకుడిగా విచ్చేసిన బాలసుబ్రమణ్యం క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు మీరు చదువుతున్న విద్యా సంస్థకు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. యోగాసనా అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యదర్శి ప్రభాకర్ ను శివాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించారు అనంతరం ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్న సుంకన్న వ్యాయామ ఉపాధ్యాయులు గీతాంజలి సుప్రియ రాజేశ్వరి సునంద చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

### దళితుని భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలి.... ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

కొమ్ముపాలెం శ్రీనివాస్ నంద్యాల నంద్యాల జిల్లా, బండి ఆత్మకూరు మండలం, నారాయణపురం గ్రామంలో, గత 80 సంవత్సరాల నుండి దళిత కుటుంబం వంశపరంగా ప్రభుత్వం ఇచ్చిన భూమిని అనుభవిస్తూ ,నేటికీ అనుభవంలో ఉండి, రెవెన్యూ రికార్డుల్లో, ఖాతా నెంబరు, పసిలి నెంబర్తో ఉన్న సర్వే నెంబర్ 573 . విస్తీర్ణ 2.14 ఖాతా నెంబర్ పసిలి కలిగి ఉన్నప్పటికీ, అక్రమంగా ప్రవేశించి వరి నాటు వేసిన సంఘటనపై ఎస్సీ అండ్ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, బాధ్యులైన గురుపాదం ఆలియాస్ చెంచయ్య, రెవిన్యూ మండల మెజిస్ట్రేట్ మరియు పోలీసు అధికారులతో, ఫీల్డ్ కు వెళ్లి సర్వేస్ చేయించడం జరిగింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL SH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190